# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-08-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశ వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వికసిత భారతదేశ పునాదిని బలోపేతం చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ లో పేర్కొన్నారు.**
2. **హర్ ఘర్ తిరంగా ద్వారా స్వాతంత్ర్య దినోత్సవం సామాజిక పర్వదినంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**
3. **తెలుగు అద్భుతమైన భాష అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ లో పేర్కొన్నారు.**
4. **అమరావతిలో జల, హరిత పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణం చేపడతామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు.**
5. **దేశంలో సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.**

==========================

దేశవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వికసిత భారతదేశ పునాదిని బలోపేతం చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమం 113వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ఆకాశవాణి ద్వారా ప్రసారమైంది. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి వివిధ అంశాలపై ప్రజలతో సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రయాన్-3 చంద్రుని దక్షిణ భాగంలోని శివ-శక్తి స్థలంలో విజయవంతంగా కాలుమోపిన సందర్భంగా ఈ నెల 23వ తేదీన మొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకున్నామని తెలిపారు. అంతరిక్ష రంగ సంస్కరణల వల్ల దేశంలోని యువతకు ప్రయోజనం చేకూరిందన్నారు. ఈ సందర్భంగా 'మన్ కీ బాత్'లో అంతరిక్ష రంగానికి సంబంధించిన కొంతమంది యువ ఉద్యోగులతో ప్రధానమంత్రి సంభాషించారు

--------------------------

హర్ ఘర్ తిరంగా ద్వారా స్వాతంత్ర్య దినోత్సవం సామాజిక పర్వదినంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ రోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ అన్ని వయసుల వారు త్రివర్ణ పతాక ఊరేగింపుల్లో పాల్గొన్నారని తెలిపారు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశంలోని నలుమూలలా, నేల- నీరు-ఆకాశంలో ఎక్కడ చూసినా జెండా మూడు రంగులే కనిపించాయన్నారు. హర్ ఘర్ తిరంగా ప్రచారం మొత్తం దేశాన్ని ఒక చోట చేర్చిందని ఇది 'ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్' కు ఉదాహరణగా నిలుస్తోందని ప్రధానమంత్రి చెబుతూ,

--------------------------

యువతను రాజకీయ వ్యవస్థతో అనుసంధానించాలని ఇచ్చిన పిలుపుకు అద్భుతమైన స్పందన వచ్చిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ రోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, యువత పెద్ద సంఖ్యలో రాజకీయాల్లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉండటం హర్షణీయమన్నారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని యువత రాజకీయాల్లో ముందుకు రావాలని వారి అనుభవం, ఉత్సాహం దేశానికి ఉపయోగపడతాయని ఆశిస్తున్నాని చెప్పారు.

---------------------------

తెలుగు అద్భుతమైన భాష అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ రోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి 'తెలుగు భాషా దినోత్సవం గురించి ప్రస్తావించారు. ఈ నెల 29వ తేదీన 'తెలుగు భాషా దినోత్సవం' ' జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా తెలుగు మాట్లాడేవారందరికీ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు చెబుతూ ప్రధానమంత్రి తెలుపుతూ,

---------------------------

పోషకాహార లోపానికి వ్యతిరేకంగా జరిగే అవగాహన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగం కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ రోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో పోషకాహార మాసం గురించి ప్రధానమంత్రి మాట్లాడుతూ, పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబరు నెల ను పోషకాహార మాసంగా జరుపుకుంటామన్నారు. గతేడాది నూతన విద్యా విధానానికి పౌష్టికాహార ప్రచారాన్ని అనుసంధానం చేశామని, 'పోషణ్ భీ పఢాయి భీ' ప్రచారం చిన్నారుల సమతుల అభివృద్ధిపై దృష్టి సారిస్తుందని పేర్కొంటూ,

---------------------------

అమరావతిలో జల, హరిత–పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణం చేపడతామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. అమరావతి అభివృద్ధి సంస్థ– ఉన్నతాధికారి డి.లక్ష్మీపార్థసారథితో కలిసి నిన్న రాజధానిలోని వెంకటపాలెం, శాఖమూరు ఉద్యాన వనాలను సందర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, శాఖమూరు, అనంతవరం, నీరుకొండ ప్రాంతాల్లో సుందరమైన రిజర్వాయర్ల నిర్మాణాన్ని చేపట్టి పర్యాటకానికి కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతామన్నారు. 300 ఎకరాల్లో నిర్మాణంలో ఉన్న శాఖమూరు సెంట్రల్ పార్కులో బోటింగు కు అనువుగా 50 ఎకరాల్లో రిజర్వాయర్‌ను నిర్మించనున్నట్టు తెలిపారు. అనంతవరంలో 35 ఎకరాల్లో ఉద్యానవనం, రాష్ట్ర సచివాలయం ముందు 21 ఎకరాల్లో మల్కాపురం పార్కును ఏర్పాటు చేస్తామని తెలిపారు.

---------------------------

సౌర, పవన విద్యుత్‌పై దృష్టి సారించి దేశంలోనే సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం మారెళ్లలో నాలుగు మెగావాట్ల సౌర శక్తి ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సౌర విద్యుత్ పర్యావరణంలో ఉత్పత్తి కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో త్వరలో మరిన్ని సౌర శక్తిప్లాంట్లను నెలకొల్పనున్నామని మంత్రి వివరించారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతీ ఒక్కరూ పెద్దఎత్తున మొక్కలు నాటాలని డా. బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ఆర్.రజని కోరారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర ప్రచార శాఖ ఆధ్వర్యంలో నిన్న శ్రీకాకుళంలో ఏక్ పేడ్ మా కే నామ్-తల్లి పేరిట ఒక మొక్క కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, కాలుష్యం నివారణకు మొక్కలు పెంచడమే పరిష్కార మార్గమని చెప్పారు. అలాగే సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, శ్రీకాకుళంజిల్లా అధికారి బి. తారకప్రసాద్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆలోచనల్లో భాగంగా దేశమంతా పెద్ద ఎత్తున తల్లిపేరిట మొక్క నాటడం కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు.

--------------------------

ప్రధానమంత్రి జన్ మన్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక గిరిజన తెగల అభివృద్ధికి.. ఆయా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని విజయనగరం జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పిఎం జన్ మన్ అమలుపై పలు శాఖల అధికారులతో నిన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమం కింద జిల్లాలోని కొత్తపాలెం, పుణ్యగిరి, గదబవలస, ఆకులకట్ట,తమ్మయ్యవలస గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక గిరిజన తెగల సంక్షేమంతో పాటు విద్య, వైద్యం, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.

--------------------------

కాలానుగుణంగా న్యాయవాదులు నూతన సాంకేతికను అందిపుచ్చుకోవాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ సూచించారు గుంటూరు లోని జిల్లా న్యాయ స్థానంలో నిన్న జరిగిన సమావేశంలో న్యాయవాదులను ఉద్దేశించి జస్టిస్ నరసింహ ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక నైపుణ్యంతో ఎన్నో సమస్యలను పరిష్కరించు కుంటున్నారని, దీన్ని యువ న్యాయవాదులు అందిపుచ్చుకుని ఉన్నతస్థితికి చేరుకోవాలని కోరారు.

--------------------------

రాష్ట్ర వ్యాప్తంగా గల ప్రభుత్వాసుపత్రులు 35 వేల పడకలతో, 11 వేల మంది వైద్యులతో రోజుకు రెండున్నర లక్షలమంది ప్రజలకు ఓపి సేవలను అందిస్తున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుంటూరు జిల్లా వడ్లమూడిలోని స్థానిక ఆసుపత్రి ఆరవ వార్షికోత్సవంలో మంత్రి పాల్గొన్నారు.

======================